సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



కొలువుదీరిన ట్రస్ట్‌బోర్డు

శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం గురువారం నిరాడంబరంగా నిర్వహించారు.

8లో



నిత్యాన్నదానట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముంబైకి చెందిన అనీల్ గుప్తాజీ గురువారం రూ.1,01,116 లను విరాళంగా నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు.

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 6,895 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

భూహక్కు రీసర్వే పూర్తికి విస్తృత చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ జగనన్న భూహక్కు భూ రక్ష పథకం రీ సర్వే పనుల రెండోదశ లక్ష్యం పూర్తికి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో నిర్దేశించిన 44 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి యజమానులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశామన్నారు. రెండోదశలో 17 గ్రామాల్లో రీ సర్వే పనులు చేపట్టామన్నారు. డ్రోన్ ఫ్లేయింగ్ ద్వారా గత వారం 114 చోట్ల ఏరియల్ సర్వే చేశారన్నారు. ఈ వారంలో మరో 19 చోట్ల ఏరియల్ పనులు నిర్వహించారన్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలకు సంబంధించి 16 గ్రామాల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 10 గ్రామాల్లో పూర్తిచేశామన్నారు. మరో 6 గ్రామాల్లో పురోగతిలో ఉందన్నారు. తరచూ క్షేత్ర స్థాయిలో పర్యటించి నమోదు ప్రక్రియను పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు డేటా నమోదులో సంబంధిత అధికారులు వ్యక్తగత బాధ్యత తీసుకోవాలన్నారు. డీఆర్‌ఓ నర్సింహులు, ఆర్డీవో ఏ చైత్రవర్షిణి, ఏడీ సర్వే అధికారి పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహిస్తునట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి శుక్రవారం తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్ తగాదాలు, యాక్సిడెంట్లు, బ్యాంకు, రాజీపడదగిన క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు. ఉదయం 10 నుంచి ఆయా కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు.


దొంగనోట్లు మార్పిడి చేసినందుకు రెండేళ్ల జైలు

అనపర్తి: మండలంలోని పాలమూరులో 2018 అక్టోబర్‌లో దొంగనోట్లు మార్పిడి చేస్తున్న అభియోగాలపై దొమ్మేటి సతీష్‌పై అనపర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఎస్‌ఐ రజనీకుమార్ కేసు నమోదు చేయగా సీఐ భాస్కరరావు విచారణ జరిపారు. ఈ కేసులో పాలమూరు గ్రామానికి చెందిన దొమ్మేటి సతీష్, అనపర్తి సావరానికి చెందిన కొవ్వూరు శ్రీనివాసరెడ్డిలకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి.గౌతమ్ తీర్పు చెప్పినట్లు అనపర్తి ఎస్‌ఐ పి.అప్పారావు తెలిపారు. ఫిర్యాది తరపున ఏపీపీ పి.శంభుప్రసాద్ వాదించంచారు

ఐడియల్ కళాశాలకు న్యాక్ గుర్తింపు

బాలాజీచెరువు: స్థానిక ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కల్పించినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం నేషనల్ ఎసెస్‌మెంట్ అక్రిడేషన్ కమిటీ ఈ నెల 2న పంజాబ్ సాంత్‌లాంగ్‌వాల్ ఇనిస్టిట్యూట్ అండ్ టెక్నాలజీ వైస్ చాన్సిలర్ డాక్టర్ వరిందర్ సాహ్నీ, డాక్టర్ మహేష్‌చంద్ర (బెంగళూరు రెవా యూనివర్సిటీ ప్రొఫెసర్), డాక్టర్ ఉర్గ సెన్‌సుమన్ (మధ్యప్రదేశ్ దేవి అహిల్య యూనివర్సిటీ సీఎస్‌ఈ ప్రొఫెసర్)ల బృందం కళాశాలలో పరిశీలించింది. తరగతి గదులు, అధ్యాపకుల బోధన తీరు, పరిశోధన గదులు, గ్రంథాలయం, క్రీడలు తదితర విభాగాలను పరిశీలించి నివేదికను యూజీసీకి ప్రతిపాదించగా న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు ప్రకటించారు. గుర్తింపు రావడం సంతోషంగా ఉందని ఏవో జీవీకే వర్మ తెలిపారు. కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ సభ్యుడు జీవీ కృష్ణంరాజు, కోశాధికారి పీఎస్ఎస్ కిరణ్ రాజు, పీఆర్‌ఓ కె.సాయిబాబు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తుని రూరల్: మండలంలోని రేఖవానిపాలెం సివిల్ సప్లయిస్ గొడౌన్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం, కాకినాడకు చెందిన అధికారులు తనిఖీలు నిర్వహించినట్టు తుని పౌరసరఫరాల అధికారి కె.పుణ్యవతి తెలిపారు. చౌకధరల దుకాణాలకు సరఫరా చేసే బియ్యం, పంచాదార, ఆయిల్ ప్యాకెట్లు పరిశీలించారు. ఆన్‌లైన్‌కు, రికార్డులకు స్వల్ప తేడాలు ఉన్నాయన్నారు. గొడౌన్ల వద్ద ఉండాల్సిన తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, జీపీఎస్ వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడాన్ని గుర్తించారన్నారు.

ఉపాధికి వెళ్లి.. ఊపిరి వదిలి



ఆయిల్ ఫ్యాక్టరీలోని ట్యాంకులు



ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద మృతదేహాలు



రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

- అంబటి సుబ్బన్న ఫ్యాక్టరీ వద్ద ఏడుగురు మృతి చెందిన సంఘటనతో అలముకున్న విషాదం
- పరిశ్రమలో భద్రతా నిబంధనలు గాలికి
- మృతులందరూ రెక్కాడితేనే కానీ డొక్కాడని వారే..
- వీరిలో ఇద్దరు పులిమేరు వాసులు
- ఐదుగురు అల్లూరు జిల్లా వారు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/పాడేరు/పెదబయలు/పిఠాపురం/పెద్దాపురం: రెక్కాడితేనే కానీ డొక్కాడని నిరుపేదలు వారు.. అయినవాళ్లను ఊరిలో వదిలి దూర ప్రాంతం నుంచి వచ్చినవారు కొందరైతే.. దగ్గరున్న ఫ్యాక్టరీలో పని చేసి కుటుంబాన్ని పోషించుకుందామని భావించిన వారు కొందరు.. తాము చేస్తున్న పని ఎంత ప్రమాదకరమైనదో గుర్తించలేని అమాయకులు.. కనీస భద్రత లేని చోట ఉపాధి పొందుతున్నామని గమనించలేని అభాగ్యులు.. ఈ పరిస్థితులే ఆ ఏడుగురి ప్రాణాలనూ బలిగొన్నాయి. పెద్దాపురం మండలం జి.రాగంపేట వద్ద అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ ట్యాంకు వద్ద గురువారం జరిగిన దుర్ఘటనలో వీరు విగతజీవులైన తీరు హృదయాలను కదిలించివేసింది. ఈ విషాదకర సంఘటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గుండెలను పిండేసింది.

ఫ్యాక్టరీలోని వంట నూనెల ప్యాకింగ్ సెక్షన్‌లోని కార్మికులకు ట్యాంకులను శుభ్రం చేసే అనుభవం ఎంతమాత్రం లేదు. అటువంటి కార్మికులతో ట్యాంకులను శుభ్రం చేయించడమే ఒక తప్పు. 24 అడుగుల ఎత్తు ఉండే ట్యాంకులో కార్మికులు దిగేటప్పుడు కనీస భద్రతా చర్యలు తీసుకోవాలనే ఆలోచన కూడా యాజమాన్యానికి లేకుండా పోయింది. ఈ నిర్లక్ష్యానికి నిరుపేద శ్రామికులు తమ ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సి వచ్చింది.



విలపిస్తున్న కట్టమూరు జగదీష్ కుటుంబ సభ్యులు

భద్రత డొల్ల

ఆయిల్ ఫ్యాక్టరీలోని ట్యాంకు లోపల ఆక్సిజన్ స్థాయి 20 శాతం ఉండేటట్టు చూడాలి. ట్యాంకుపై గాలి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి. ట్యాంకుల్లోకి కార్మికులు దిగేటప్పుడు కనీసం వారికి ఆక్సిజన్ మాస్కులు కూడా ఇవ్వడం లేదని తాజా ప్రమాదం చెబుతోంది. 24 అడుగుల లోతున్న ట్యాంకుల్లో మడ్డి తొలగించేందుకు నైపుణ్యమున్న కార్మికులను మాత్రమే వినియోగించాలి. కానీ ఇలాంటి చర్యలేవీ యాజమాన్యం తీసుకున్న దాఖలాలు కనిపించలేదు.

మృతులు

1. వెచ్చంగి కృష్ణ (35)-అల్లూరి జిల్లా
2. వెచ్చంగి నరసింహం (38)- అల్లూరి జిల్లా
3. వెచ్చంగి సాగర్ (20)- అల్లూరి జిల్లా
4. కుర్తాడి బొంజుబాబు (30)-అల్లూరి జిల్లా
5. కుర్రా రామారావు (34)- అల్లూరి జిల్లా
6. కట్టమూరు జగదీష్(25)- పెద్దాపురం మండలం పులిమేరు
7. యల్లమిల్లి ప్రసాద్ (27) - పెద్దాపురం మండలం పులిమేరు

సామర్లకోట వద్ద ఏఎస్ ఆయిల్స్ కంపెనీయే రాగంపేటలో నువ్వుల నూనె తీసి, ఇదే ప్లాంట్‌లోని ట్యాంకుల్లో నిల్వ చేసి ప్యాకింగ్‌కు పంపిస్తుంది. ఈ ట్యాంకులకు అనుమతి ఉందా లేదా అనే దానిపై ఇప్పుడు అధికారులు విచారణ జరుపుతున్నారు. మెయిన్ ఫ్యాక్టరీకి ఉన్న అనుమతులతోనే ఇక్కడి ప్లాంట్‌లో ట్యాంకులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది.

మార్చురీ వద్ద మంత్రి వేణు నివాళి

కాకినాడ జీజీహెచ్‌కు పోస్టుమార్టానికి తరలించిన మృతదేహాలకు బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నివాళి అర్పించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పాడేరు నుంచి మృతుల కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్‌కు చేరాల్సి ఉందని, ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించనున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి తెలిపారు. మృతదేహాలను పరిశీలించిన వారిలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సహా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, డీసీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ అనిత, ఆర్‌ఎంఓ డాక్టర్ రాహుల్ ఉన్నారు.



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా, చిత్రంలో హైసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

మిన్నంటిన రోదనలు

రాగంపేట సంఘటనా స్థలానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. మరోపక్క మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. పులిమేరుకు చెందిన కట్టమూరు జగదీష్ (25) ఫ్యాక్టరీ ప్యాకింగ్ సెక్షన్‌లో పని చేస్తుంటాడు. అందరితో చాలా చనువుగా ఉంటాడు. ఎవరితోనూ వివాదాలు లేకుండా ఏ చిన్న పనైనా చేసి పెడుతుండే జగదీష్ చనిపోయాడంటే నమ్మలేకపోతున్నామని స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. 'కుటుంబానికి ఉన్న ఏకైక దిక్కు దుర్గాప్రసాద్‌ను కోల్పోయాం, మాకిక దిక్కెవరు?' అంటూ తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

భార్య గర్భిణి

మరో మృతుడు యల్లమిల్లి దుర్గాప్రసాద్‌కు ఉప్పాడ కొత్తపల్లి మండలం కొండెవరానికి చెందిన సత్యతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. సత్య ఇప్పుడు గర్భిణి. సాయంత్రం తొందరగా వచ్చేస్తానని చెప్పి వెళ్లిన భర్త ఇక తిరిగి రాడని తెలిసి ఆమె రోదిస్తోన్న తీరు స్థానికులను కలచివేసింది. పని కోసం వెళ్లిన అన్న మృత్యువాత పడటంతో తమ్ముడు పవన్ వినయ్ గుండెలవిసేలా విలపిస్తున్నాడు.

అరణ్యరోదన

కొర్రా రామారావు మృతితో అతడిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల పరిస్థితి దయనీయంగా మారింది. భార్య కొమాలమ్మతో పాటు సన్యాసమ్మ, లక్ష్మి, పండుబాబు, శంకర్, రాధిక, సాయి, శేఖర్, మేరీ సంతానం ఉన్నారు. వీరంతా చిన్నవయసు వారే. ఐదుగురు ప్రాథమిక విద్య చదువుతున్నారు. కుటుంబ యజమాని మృతితో వారంతా గుండెలవిసేలా రోదిస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో..

వెచ్చంగి కృష్ణారావుకు భార్య లక్ష్మితో పాటు పిల్లలు కవిత, త్రినాథ్, వినీత, సంగీత, ప్రవీణ్ ఉన్నారు. వీరంతా పదేళ్ల వయసు లోపు వారే. తండ్రి కోసం వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

గుండెలవిసేలా..

కుర్తాడి బొంజుబాబుకు భార్య నీలమ్మతో పాటు తండ్రి అర్జున్, పిల్లలు సాయి, బాలకృష్ణ, వెంకటలక్ష్మి, శ్రీవాణి ఉన్నారు. వీరు కూడా చిన్న పిల్లలే. పలు విద్యాలయాల్లో చదువుతున్నారు. వీరి చదువులకు, జీవనోపాధికి రెక్కలు ముక్కలు చేసుకుంటున్న కుటుంబ యజమాని మరణంతో వారందరూ దిక్కుతోచని స్థితిలో ఆవేదన చెందుతున్నారు.

కుటుంబానికి బాసటగా..

మృతుల్లో వెచ్చంగి సాగర్(23)కు వివాహం జరగలేదు. మూడో తరగతి వరకూ చదువుకున్నాడు. ఒక్కడే కావడంతో కుటుంబ బాధ్యతలన్నీ అతడిపైనే పడ్డాయి. ఆయిల్ ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తూ వస్తున్న ఆదాయంలో కొంత మొత్తాన్ని ప్రతి నెలా కుటుంబానికి పంపిస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు సత్యవతి, సీతారామ్, చెల్లెళ్లు ఉన్నారు. వీరికి ఏ కష్టం రాకుండా అండగా ఉంటూ కుటుంబానికి బాసటగా నిలిచాడు. సాగర్ మృతితో తమకు దిక్కెవరంటూ వారంతా రోదిస్తున్నారు.

రాత్రి 9 గంటలకు మాట్లాడా..

భర్త నర్సింగరావుతో బుధవారం రాత్రి 9 గంటలకు మాట్లాడానని, తెల్లవారేసరికి దుర్వార్త వినాల్సి వచ్చిందని అతని భార్య పారతమ్మ గుండెలవిసేలా రోదించింది. నర్సింగరావుకు భార్యతో పాటు నలుగురు సంతానం ఉన్నారు.

ఓటు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో ఓటరు నమోదు, చిరునామా మార్పులకు సంబంధించిన దరఖాస్తుదారుల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ మాధవీలత వెల్లడించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ 60,786 దరఖాస్తులలో 52,564 ఆమోదించామన్నారు. కాలేజి విద్యార్థులకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. 1,853 ఓటరు నమోదు దరఖాస్తులకు సంబంధించి బీఎల్‌ఓ పరిశీలన పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు 4,633 దరఖాస్తులు తిరస్కరించారన్నారు. ఫారం-6 కి చెందిన 33,789 దరఖాస్తులకు గాను 29,387 ఆమోదించామన్నారు. 2,389 తిరస్కరించారన్నారు. 2016 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. ఫారం-7 కోసం 18,511 దరఖాస్తులకు 17440 ఆమోదించామన్నారు. ఫారం-8కి చెందిన 8,496 దరఖాస్తులలో 6737 ఆమోదించగా 1258 తిరస్కరించారన్నారు. 537 పరిశీలనలో ఉన్నాయన్నారు. జిల్లాలో ఈనెల 8వ తేదీ నాటికి 15,53, 489 ఓటర్లు ఉన్నారన్నారు. 73 శాతం ఆధార్ అనుసంధానం ప్రక్రియ పూర్తి చేశామన్నారు. 13,847 ఓట్లు డూప్లికేటుగా గుర్తించి తొలగించారన్నారు. డీఆర్‌ఓ జి.నర్సింహులు, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి పాల్గొన్నారు.

బాధితులకు సాయంగా ఆపదమిత్రలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రకృతి విపత్తులు, వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులకు సహాయంగా నిలిచేందుకు ఆపదమిత్ర ద్వారా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఇలా శిక్షణ పొందిన అభ్యర్థులు గురువారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులతో పాటు వలంటీర్లు, ఆశవర్కర్లకు 12 రోజుల శిక్షణ అందించామన్నారు. తొలి దశలో 40 మందికి శిక్షణ ఇచ్చామని, వారికి ధ్రువపత్రాలతో పాటు కిట్లు ప్రదానం చేస్తున్నామన్నారు. ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ సామర్లకోట ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ మరో 150 మందికి ఈ నెల ఆరు నుంచి 17 వరకూ శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీఎం జి.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.




శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

ఎద్దడి లేకుండా పద్ధతిగా..



పి.గన్నవరం బ్యాంకు కెనాల్



లొల్ల లాకులు

- డెల్టాలో శివారుకు నీరందించేలా చర్యలు
- ఫిబ్రవరి 4 నుంచి మొదలైన వంతుల వారీ విధానం
- సాగునీటి యాజమాన్యం కోసం మండల స్థాయి కమిటీలు
- త్వరలోనే మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌లు
- సీలేరు నుంచి ఆగిన అదనపు నీరు

సాక్షి అమలాపురం: రబీ సాగులో శివారు ఆయకట్టుకు నీటిఎద్దడి రాకుండా జిల్లా యంత్రాంగం చర్యలకు శ్రీకారం చుట్టింది. ధవళేశ్వరం బ్యారేజీ ఎగువ నుంచి నీటి రాక తగ్గడంతో గోదావరి డెల్టా కాలువలకు పూర్తి సామర్థ్యం మేరకు అందించడం లేదు. కాని కాలువలకు విడుదల చేస్తున్న నీటిని ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో రైతులకు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

మూడు డెల్టాలకు 6,895 క్యూసెక్కులు

గోదావరి డెల్టా పరిధిలో జిల్లాలో తూర్పు, మధ్య డెల్టాలలో కలిసి 2.08 లక్షల ఎకరాల ఆయకట్టు కాగా, 1.72 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు గురువారం ఉదయం సీలేరు నుంచి 4,567, పోలవరం ప్రాజెక్టు నుంచి 2,560 చొప్పున మొత్తం ఇన్‌ఫ్లో 7,127 క్యూసెక్కుల నీరు వచ్చింది. తూర్పుడెల్టాకు 2,030, మధ్యడెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 చొప్పున మొత్తం 6,895 క్యూసెక్కుల నీటిని 130 డ్యూటీ (ఒక క్యూసెక్కు 130 ఎకరాలకు చొప్పున) విడుదల చేస్తున్నారు.

పాండ్ లెవెల్ తగ్గకుండా పొదుపుగా విడుదల

తూర్పు, మధ్య డెల్టాలలో 90 శాతం చేలల్లో నాట్లు పూర్తయ్యి తొలి దఫా ఎరువులు వేస్తున్నారు. ఈ సమయంలో 90 డ్యూటీలో నీరు ఇవ్వాల్సి వస్తోంది. కాని తక్కువగా ఇస్తుండడం వల్ల శివారుకు నీరందడం ఆలస్యమవుతోంది. ముఖ్యంగా ముక్తేశ్వరం, పి.గన్నవరం ప్రధాన పంట కాలువల శివారులో చానల్స్ ద్వారా 12 నుంచి 18 కిలోమీటర్ల నిడివి వెళ్లి, అక్కడ నుంచి పంట బోదెల ద్వారా ఆయకట్టుకు సాగునీరందించాల్సి ఉంది. వారం రోజుల క్రితం వరకు సీలేరు పవర్ జనరేషన్ నుంచి 4,500ల క్యూసెక్కుల నీటికి అదనంగా 3,000 క్యూసెక్కుల నీటిని బైపాస్ పద్ధతిలో (స్పిల్ వే నుంచి విడుదల) సేకరించేవారు. ఈ కారణంగా గత జనవరి చివరి వారంలో డెల్టా కాలువలకు 9,250 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశారు. బైపాస్ పద్ధతిలో నీటి విడుదల నిలిపి వేయడంతో కాలువలకు తగ్గించారు. ధవళేశ్వరం పాండ్ లెవెల్ తగ్గిపోకుండా తీసుకునే చర్యల్లో భాగంగా డెల్టా కాలువలకు నీటిని పొదుపుగా విడుదల చేయాల్సి వస్తోంది.

నీటి యాజమాన్య చర్యలు

కాలువలకు విడుదల అవుతున్న నీటిని మెరక, శివారుకు సక్రమంగా వెళ్లేందుకు సాగునీటి పారుదల శాఖ అధికారులు యాజమాన్య పద్ధతులకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 4వ తేదీ నుంచి వంతుల వారీ విధానాన్ని అమలులోకి తెచ్చారు. మండల, పంట కాలువల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో తహసీల్దారు, ఏవో, ఇరిగేషన్ జేఈఈ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, లాకు సూపరింటెండెంట్‌లు సభ్యులుగా ఉంటారు. క్షేత్రస్థాయిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటారు. ఇదే సమయంలో మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్లను వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా అందిస్తాం



డెల్టా కాలువలకు ఈ నెల 4వ తేదీ నుంచి వంతుల వారీ విధానం అమలు చేస్తున్నాం. తొలి వంతు మరో నాలుగు రోజుల్లో పూర్తవుతుంది. తిరిగి రెండో వంతు మొదలవుతుంది. దీనివల్ల ముందుగా నీరందని చేలకు ఇప్పుడు నీరొస్తుంది. దీనివల్ల శివారుల్లో నీటి కొరత తీరుతుంది. డెల్టా కాలువలకు ప్రణాళికాబద్ధంగా నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డి.వి.రామ్‌గోపాల్, ఇరిగేషన్ జిల్లా అధికారి

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తుని: రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ గురువారం తెలిపారు. నక్కపల్లి మండలం గుల్లిపాడు–తుని మధ్యలో విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 25 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై **నీలం రంగుపై** నలుపు నిలువు చారల ఆఫ్ **చేతుల చొక్కా,** నీలం రంగు జీన్స్ ఫ్యాంటు **ఉంది. కేసు** నమోదు చేసి మృతదేహాన్ని **తుని ప్రభుత్వ** ఆసుపత్రికి తరలించారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు**గోదావరి జిల్లా** స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక**ల షెడ్యూల్‌ను** భారత ఎన్నికల సంఘం విడుద**ల చేసిందని కాకి**నాడ జిల్లా రెవెన్యూ అధికారి కె.**శ్రీధర్‌రెడ్డి గురు**వారం తెలిపారు. పూర్వపు **తూర్పుగోదావరి** జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తిసుందన్నారు. ఈ నెల 16వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు వివరించారు. 23న నామినేషన్ల స్వీకరణ, 24న నామినేషన్ల స్క్రూటినీ ఉంటుంది. నామినేషన్లు ఉపసంహరణకు గడువు 27వ తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నిక జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు మార్చి 16వ తేదీన జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ మార్చి 21న పూర్తి అవుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల నియమావళి ఈ నెల 9వ తేదీ నుంచి అమలులోకి వస్తుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి స్థానిక సంస్థల నుంచి శాసనమండలికి ఎంపికైన చిక్కాల రామచంద్రరావు పదవీ కాలం మే ఒకటో తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరుగుతోంది.

భాగాల గుర్తింపు ముఖ్యం



జంతుశాస్త్ర ప్రయోగ పరీక్షలో మూడు ప్రశ్నలుంటాయి. ఒకటో ప్రశ్నగా చార్ట్‌ను డిస్‌ప్లే చేస్తారు. టైటిల్ చెప్పి పటం గీసి భాగాలను గుర్తించాలి. వీటికి ఆరు మార్కులు. రెండో ప్రశ్నగా ఫిజియాలజీ ప్రయోగం ఇస్తారు. ఈ ప్రశ్నకు మూలసూత్రం, ప్రయోగ విధానం, ఫలితం తప్పనిసరిగా రాయాలి. సైడ్ హెడ్డింగ్స్ పెట్టి, సంబంధిత సమాచారం రాయాలి. వీటికి ఐదు మార్కులు. మూడో ప్రశ్నలో స్లైడులు, స్పెసిమెన్స్ కలిపి ఏడు రకాల స్పాటర్స్ ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు. నాలుగో ప్రశ్న రికార్డు. దానికి ఐదు మార్కులు. జువాలజీ ప్రాక్టికల్స్‌లో 30 మార్కులు తెచ్చుకోవడం సులువు. అయితే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి. ఒకటి, మూడు ప్రశ్నలకు సంబంధించి డయాగ్రామ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి. రికార్డులో డయాగ్రామ్స్, దాని సూచికలు బాగుండాలి. 'శరీరధర్మశాస్త్ర ప్రయోగాల్లో తప్పనిసరిగా మూల సూత్రం, ప్రయోగ విధానం, ఫలితం ఉండాలి.

– డాక్టర్ నల్లమిల్లి సురేష్‌రెడ్డి, జంతుశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావులపాలెం

మంచి మార్కులు సాధించవచ్చు



'భౌతిక శాస్త్రానికి మూడు గంటల సమయానికి 30 మార్కులు కేటాయిస్తారు. మొత్తంగా 20 ప్రయోగాల్లో ఆరు విభాగాల నుంచి 38 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి బ్యాచ్‌కు 12 ప్రశ్నల వంతున ఇస్తారు. ప్రయోగ సూత్రానికి రెండు మార్కులు, ప్రయోగ విధానానికి మూడు మార్కులు, పట్టికలు, పరిశీలనలు, గ్రాఫ్‌లకు ఎనిమిది, కాలిక్యులేషన్స్‌కు నాలుగు, జాగ్రత్తలకు రెండు, ఫలితం, ప్రమాణాలకు రెండు మార్కులు, రికార్డులకు నాలుగు, వైవాకు ఐదు మొత్తంగా 30 మార్కులుంటాయి. లాగరిథమ్స్ ఉపయోగిస్తూ కాలిక్యులేషన్స్ చేస్తే పూర్తి మార్కులు వస్తాయి. అన్ని ప్రయోగాలకు జాగ్రత్తలు తప్పనిసరిగా రాయాలి. అన్ని ప్రయోగ విలువలు ఒకే ప్రమాణ పద్ధతిలో ఉండేలా చూసుకోవాలి. ప్రమాణాలు ప్రతి విలువకు ఉన్నాయో లేదో చూసుకోవాలి. పట్టికల్లో ప్రమాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్తు ప్రయోగాలకు సర్క్యూట్ డయాగ్రామ్(వలయ చిత్రం) తప్పనిసరిగా వేయాలి.

– కె.దమయంతి, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావులపాలెం

సూటిగా సమాధానాలు చెప్పాలి



వృక్షశాస్త్రం ప్రయోగ పరీక్షకు 30 మార్కుల ప్రశ్న పత్రంలో ఐదు విభాగాలు ఉంటాయి. ఒకటో ప్రశ్నకు వృక్ష వర్గీకరణ శాస్త్రంలో మూడు కుటుంబాల్లో ఒక కుటుంబం నుంచి వస్తుంది. వర్ణన క్రమపద్ధతిలో, ప్రణాళికాబద్ధంగా రాయాలి. ఇచ్చిన మొక్కను బట్టి పుష్పచిత్రం, సమీకరణం, కుటుంబం గుర్తింపు తప్పనిసరి. రెండో ప్రశ్న వృక్ష అంతర్నిర్మాణ శాస్త్రం నుంచి వస్తుంది. ఇచ్చిన మెటీరియల్‌ను బట్టి స్లైడ్ తయారీని చాలా శ్రద్ధగా చేయాలి. భాగములు గుర్తించి, సెక్టర్ పటం గీసి, గుర్తింపు రాయడం ముఖ్యం. మూడో ప్రశ్న వృక్ష శరీర ధర్మశాస్త్రం నుంచి వస్తుంది. లాటరీ పద్ధతిలో విద్యార్థికి వచ్చిన ప్రయోగానికి అనుగుణంగా పరికరాల అమరిక చేయాలి. ఉద్దేశం, సూత్రం, పరిశీలన, ఫలితం మాత్రమే రాయాలి. నాలుగో ప్రశ్నకు ఐదు మార్కులు పొందవచ్చు. స్పాటరు లేదా స్లైడును గుర్తించి దాని లక్షణాలు రాయాలి. రికార్డు, హెర్బేరియాలలో హెర్బేరియాను నీట్‌గా తయారు చేసి కవర్‌లో ఉంచి కవర్‌పై నంబరు వేయాలి.

– పెనల కర్నారావు, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, అమలాపురం

ప్రత్యేక శ్రద్ధతో లక్ష్య సిద్ధి

- నూచనలు పాటిస్తే 30/30 సాధ్యమే..
- ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్


ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయవరం: విద్యార్థి దశలో అత్యంత కీలకమైనది ఇంటర్మీడియెట్. ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కోర్సులు అభ్యసించేందుకు కోరుకున్న కళాశాలలో, కోర్సులో సీటు దక్కించుకొనేందుకు ఇక్కడ సాధించే మార్కులు కీలకం. సైన్స్ విద్యార్థుల మార్కుల్లో ప్రాక్టికల్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు శ్రద్ధ చూపితే 30కి 30 మార్కులు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. ప్రయోగ పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. ఇక మిగిలింది 10 రోజులు మాత్రమే. కోనసీమ జిల్లాలో సుమారు ఆరు వేల మంది ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్నారు. ఈ క్రమంలో అధ్యాపకుల సూచనలు విద్యార్థుల కోసం..

ప్రయోగ పరీక్షల షెడ్యూల్

జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉదయం 9–12 గంటల వరకు, మధ్యాహ్నం 2–5 గంటల వరకు జరగనున్నాయి. ఎంపీసీ అన్ని సబ్జెక్టులు కలిపి 60, బైపీసీ విద్యార్థులకు 120 మార్కులు కేటాయిస్తారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు జనరల్ కోర్సులు, ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఆదివారాలతో సహా ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 15న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్, ఫిబ్రవరి 17న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తారు.

ఫలితం తప్పనిసరి



కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌కు మూడు గంటల సమయం ఇస్తారు. మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో లవణ విశ్లేషణ ఉంటుంది. లవణ విశ్లేషణలో భౌతిక పరీక్షలు చేసిన తర్వాత రసాయన పరీక్షలు చేసి, ఆనయాన్, కాటయాన్‌లను గుర్తించడం, వాటి నిర్ధారణ పరీక్షలు ముఖ్యమైనవి. చివరగా ఫలితం తప్పనిసరిగా రాయాలి. ఫలితానికి ఒక మార్కు ఉంటుంది. మొత్తంగా ఈ విభాగానికి పది మార్కులుంటాయి. రెండో విభాగంలో ఘన పరిమాణాత్మక విశ్లేషణకు 8 మార్కులు. ప్రాక్టికల్ ప్రారంభమైన వెంటనే మొదటి పది నిమిషాల్లో ప్రయోగ విధానం రాయాలి. బ్యూరెట్ రీడింగులు, ఎటువంటి కొట్టివేతలు లేకుండా పట్టికలు రాసి, లెక్కింపు విధానం, ఫలితం రాయాలి. మూడో విభాగానికి ఆరు మార్కులు. ఎ నుంచి డి వరకు ప్రశ్నల్లో ఒకటి మాత్రమే రాయాలి. 'ఎ' ప్రశ్న కర్బన సమ్మేళనంలో ప్రమేయ సమూహాన్ని గుర్తించడం. 'బి' ప్రశ్న కొల్లాయిడ్ ద్రావణాలను తయారు చేయడం. 'సి' ప్రశ్న క్రొమటోగ్రఫీ. 'డి' ప్రశ్న కార్బోహైడ్రేట్, ప్రొటీన్ల చర్యలపై ఉంటాయి. వైవాకు, ప్రాజెక్టు రికార్డు, జనరల్ రికార్డుకు రెండేసి మార్కుల వంతున ఆరు మార్కులుంటాయి.

– ఎస్.వి.సూర్యనారాయణరెడ్డి, రసాయనశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండపేట

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాయవరం: మండలంలోని వెదురుపాక గ్రామానికి చెందిన పడాల సూర్యనారాయణ(42) మృతిని గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన కేసుగా నమోదు చేశారు. ఈ విషయాన్ని రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ విలేకరులకు తెలిపారు. మృతుడు సూర్యనారాయణ ప్రతి రోజు బట్టీ పని నిమిత్తం వెదురుపాక నుంచి రాయవరం గ్రామానికి వస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం మూడు గంటల సమయంలో వెదురుపాక నుంచి బయలుదేరి రాయవరం సమీపంలోని బట్టీలో పనికి బయలుదేరాడు. సూర్యనారాయణ బట్టీ పక్కన వరి చేలో తల బురదలో కూరుకుపోయి చనిపోయినట్లుగా వెదురుపాక గ్రామానికి చెందిన గోవిందు అనే వ్యక్తి సూర్యనారాయణ కుమారుడు సువర్ణరాజుకు తెలిపాడు. ఈ మేరకు సువర్ణరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

కొలువుదీరిన ట్రస్ట్‌బోర్డు

అన్నవరం దేవస్థానంలో 13 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అధికారులు


అన్నవరం ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు



విడిగా ప్రమాణ స్వీకారం చేసిన నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం గురువారం నిరాడంబరంగా నిర్వహించారు. 16 మందికి గాను 13 మంది సభ్యులు ఈఓ క్యాంపు కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. సత్యదేవునిపై ప్రమాణం చేసి దేవస్థానం రహస్యాలు వెల్లడించబోమని, ఆలయ అభివృద్ధికి పాటు పడతామని ప్రమాణం చేశారు. సభ్యులు కొట్టం పశువులరావు, తాడి రజని, దోశీ వీర సూర్యనారాయణ, నక్కా అశ్విని, సాపిశెట్టి భూలక్ష్మి, పేరూరి బద్రీ నారాయణ, బొడ్డాని విజయలక్ష్మి, నున్న నరసింహరావు, కడియాల లక్ష్మణరావు, కర్రి భామిరెడ్డి, రాయుడు సూర్యావతితో ఈఓ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ డీవీబీ రమేష్‌బాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తరువాత వచ్చిన కేవీ నాగేశ్వరరావు, నేతల వెంకటలక్ష్మితో విడిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్, ఏజెన్సీకి చెందిన సభ్యురాలు కారుకోడి పోచమ్మ, ట్రస్ట్‌బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నియమితులైన దేవస్థానం ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. వీరితో త్వరలో ప్రమాణ స్వీకారం చేయిస్తామని ఈఓ తెలిపారు. అనంతరం సభ్యులకు ధర్మకర్తల మండలి సమావేశంలో జరిగే చర్చలు, తదితర విషయాల గురించి ఏసీ రమేష్‌బాబు వివరించారు. ఏఈఓ లు శ్రీనివాస్, పీఆర్వోఓ కృష్ణారావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. కొండపైన మాధవ కల్యాణ మంటప సముదాయంలోని వైజయంతి కల్యాణ మంటపంలో ఉదయం 11.15 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం వరకూ కొనసాగింది. సభ్యులకు ఈఓ వేండ్ర త్రినాథరావు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ముఖ్య అతిథులుగా గోపాలపురం, దెందులూరు ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొన్నారు.

ఒకేసారి సభ్యులందరితో..

ధర్మకర్తల మండలి సభ్యులందరితో ఒకేసారి ఆలయ ఈఓ త్రినాథరావు ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా ఎస్వీ సుధాకరరావు, సభ్యులుగా నాళ్లం కృష్ణవీర సుబ్బలక్ష్మి, చిట్టూరి మణి, ముస్సే శ్రీను, పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, మానుకొండ సుబ్బారావు, తానంకి గంగరాజు, పాయం మంగతాయారు, నూకాల అమ్మాజీ, పాల వెంకటేశ్వరరావు, బోడపాటి దేవిమానిక, ఆచంట అనసూయ, గుర్రం సూర్యావతి, వాసా రామకృష్ణ, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ ప్రధానార్చకులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాథాచార్యులు (రాంబాబు) చినవెంకన్న సాక్షిగా ప్రమాణం చేశారు. సభ్యుడు ముప్పిడి సంపత్‌కుమార్ ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు.


ద్వారకా తిరుమల ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులతో ఎమ్మెల్యేలు వెంకట్రావు, అబ్బయ్య చౌదరి

సేవే లక్ష్యంగా ముందుకు సాగాలి

నూతన ట్రస్టుబోర్డు సభ్యులు సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లలకు పెళ్లికానుక

- నేడు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా అమలు
- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం జగన్
- జిల్లాలో 108 మందికి 91.05 లక్షలు మంజూరు



రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మరో హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన యువతుల వివాహాలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాల ద్వారా ఆర్థిక సాయాన్ని శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. సొమ్ములు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమకానున్నాయి. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన, ఇతర నిర్మాణ కార్మికులకు లబ్ధి చేకూరుతుంది. ముస్లిం కమ్యూనిటీలోని మైనార్టీలు వైఎస్సార్ షాదీతోఫాకు అర్హులు. ఈ మేరకు గత ఏడాది అక్టోబర్ ఒకటి నుంచి జనవరి 31వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 156 దరఖాస్తులు అందగా, అర్హులైన 108 మందికి రూ.91.05 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నగదును శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

108 మందికి రూ.91.05 లక్షలు మంజూరు



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలకు జిల్లాలో తొలి విడతలో 156 మంది దరఖాస్తు చేసుకోగా అందులో అర్హులైన 108 మంది లబ్ధిదారులకు రూ.91.05 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో లబ్ధిదారుల బ్యాంకుఖాతాలో శుక్రవారం నగదు జమ చేయనున్నారు.

– డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్

సర్వత్రా హర్షం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు. దానిలో భాగంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను అమలు చేస్తున్నారు. లబ్ధిదారుల ఖాతాలో శుక్రవారం నగదు జమ చేయనుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పేద ఆడబిడ్డల వివాహానికి అన్నగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

1.5 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఒక గోదాములో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్ ఆదేశాలతో ద్రాక్షారామలో ఉంగరాల లక్ష్మీ వీరవెంకటకుమార్‌కు చెందిన ఇంటిలో సోదాలు చేయగా 30 మూటల్లో అక్రమంగా దాచిన 1.5 టన్నుల రేషన్ బియ్యం దొరికినట్లు విజిలెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బియ్యం సీజ్ చేసి ద్రాక్షారామలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. విజిలెన్స్ దాడుల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్‌కే వలి, కానిస్టేబుళ్లు కిషోర్, లోవరాజు, ఎంఎస్ఓ అలీషా, వీఆర్ఓ సాయిబాబు పాల్గొన్నారు.